# పుత్రోత్సాహం

శ్రీమతి గిరిరమణరావు

మద్రాసు ఎయిర్‌పోర్టునుండీ నేను, మావారు, మరి కొంతమంది మిత్రులతో బయటకు వచ్చాము.

గుండెల్లో అదో అలజడి, కళ్లలో నీటిపొర, నడకలో అడుగులు తడబడ్డాయి.

అది గ్రహించిన ఓ అప్సరాలు తన చేయి ఆసరగా అందించి అదిమిపట్టుకుని బయటికి తీసుకొచ్చి టాక్సీ ఎక్కేవరకూ సహాయపడింది.

మద్రాసులో చూడవలసిన స్థలాలెన్నో వున్నా, ఉద్వాసన చెప్పేసి మావూరు తిరిగి వచ్చేశాం.

ఇంటిముఖం పట్టాక ఉదయం లేచాక ఏం చేయాలో, ఏమిటో అంతుపట్టేది కాదు. గుండెలనిండా దుఃఖం గూడుకట్టుకుంది. మావారెంతో నచ్చచెప్ప ప్రయత్నించారు. "ఇప్పుడేం జరిగిందనీ అంతగా కుమిలిపోవడం? ఆడపిల్లలే ఈరోజుల్లో ఒంటరిగా, ధైర్యంగా ముందంజ వేస్తూ విదేశాలు వెళ్లొస్తూ వుంటే... మగపిల్లవాణ్ని పంపిస్తూ వాడి ఉన్నతికి ఆశపడే నువ్వు, పైగా చదువుకున్న తల్లివై, ఇలా బేలగా నాకేం నచ్చలేదు. ప్చ్..." అంటూ పెదవి విరిచారు.

అలా అని ఆయన మనస్సులో దుఃఖం లేదని కాదు, వాడిని అమెరికా పంపేసిన ఆ బాధ ఆయనకీ లేక కాదు. కేవలం నన్ను ఊరడించడం కోసమే... అంతే...

అయితే కొన్ని కొన్ని నిజాలని నమ్మటం కష్టం. మరికొన్ని విషయాలని సర్దుకుపోతూ ఏమీ లేదని పైకి చెప్పుకుంటూ బ్రతికేయటం అంతకంటే దుర్లభం.

సుమారు ఇరవై రెండేళ్ల క్రితం నాకు కొడుకు పుట్టాడు. ఇంచుమించు నా పోలికలే కొట్టొచ్చినట్లు కన్పించాయి. నా ఆనందానికి అడ్డుగోడలే లేకపోయాయి

అప్పుడు బడిపంతులుగా పనిచేస్తోన్న మావారు 'పుత్రోత్సాహం తండ్రికి పుత్రుడు జన్మించినపుడే కలగదు. జనులా పుత్రుని కనుగొని పొగడగ పుత్రోత్సాహం కల్గు సుమ్మీ!' అంటూ జ్ఞాపకమున్నంతవరకూ ఆ పద్యపాదాలని నా ముందు వల్లెవేశారు.

తన కొడుకుని చూసుకుంటూ— 'ఇంగ్లీషు మాస్టారు కదూ. పాపం!' అనుకొన్నాను. కాని నాకైతే మాత్రం ఆ భావం లోతులకు పోయి తొంగిచూసే అవసరం లేకపోయింది.

అయితేవాడికి మంచి పోషకాహారం ఇవ్వాలని, ఏ విషయంలోనూ బాధ పడకూడదనీ మాత్రం అనుకొన్నాను. మా మధ్య తరగతి పేదరికపు నీడలు వాడిపై ఛాయామాత్రంగానైనా వాలకూడదనీ నిర్ణయించుకున్నాను. వాడికి శక్తికొలదీ ఉన్నతమైన విద్య అందించాలనేదే నా ముఖ్యోద్దేశం!

అందుకే మావాడ్ని ఎమ్.ఎ చదివించడానికి ఎన్నో అగచాట్లు పడవలసి వచ్చింది.

డబ్బుకి ఇబ్బందిపడ్డాం. గట్టిగా చెప్పకూడదేమో గాని తిండికి కూడా!...

ఒకనాడు వాడు పక్కింట్లో భోంచేసి వచ్చానన్నాడు. నేను ఇన్‌ఫీరియర్‌గా ఫీలయ్యాను. వాడిని చావగొట్టాను. "ఎందుకు తిన్నావ్? వాళ్లేం అనుకొంటారు. మనింట్లో అన్నం లేదనుకొన్నావా?" అంటూ విరుచుకుపడ్డాను. వాడు బిక్కమొఖంవేసి "లేదమ్మా! ఆవిడ నెయ్యి, పప్పు మరింత వేసి అన్నం పెట్టింది. అయినా నాకు నువ్వంటే, నీ వంటంటేనే ఇష్టం. నన్ను కోప్పడొద్దు" అంటూ నా వద్దకే చేరాడు. పాపం! పసివాణ్ణి దండించానని నేనే బాధపడ్డాను.

వేన్నీళ్లకి చన్నీళ్లలా వుంటుందని పదిమందికి ట్యూషన్ చెప్పడం మొదలుపెట్టాను. అందుకోసం నవీన్ చదువు వెనుకపడుతుందేమోనని భయపడ్డాను.

మాటలు వస్తూన్న మొదటి క్షణాల్లో అ,ఆలు, ఎబిసిడిలు కాక మొక్కల పేర్లు వల్లె వేయించాను. దైవభక్తి రంగరించి మంచి గంధపు పూతగా పూశాను. శ్రీరాముని సరళ స్వభావము, శ్రీకృష్ణుని బుద్ధి కుశలత కలగలిపి బొబోసవగా అందించాను. అయినా మేమిద్దరం స్నేహితుల్లా కంటే శత్రువుల్లాగే ఎదురౌతూ వుండేవారం.

స్కూల్లో జాయిన్ చేసాక ప్రోగ్రెస్ కార్డు ఇంటికి ఇవ్వడమంటే వాడికి బ్రహ్మప్రళయంలా వుండేది. "ఎందుకు ఫస్ట్‌ర్యాంక్ రాలేదు? మనకి అసలే సీట్లు దొరకడం కష్టం! నువ్వెందుకు చదవలేదు? నీతో మాట్లాడనంతే" అనేసే దాన్ని— వాడు భయపడేవాడు. బాధపడేవాడు. 'ఈ మాటు తెచ్చుకుంటాను అమ్మా' అంటూ ప్రామిస్ చేసేవాడు.

"కంఠస్థం పెట్టిన తెలుగుపద్యం ఇలా రాసేవేం? పాదభంగం లేకుండా ఎందుకు రాయలేదు" నా మాటలకు ఫాలో అవుతూ ఓ చెంప దెబ్బ! ఇంగ్లీషు పద్యం రాయటంలో ఇన్ని స్పెల్లింగ్ మిస్టేక్సా" మరో చిన్న దెబ్బ అనుసరించేది.

'ఇవాళ సినిమాకి నేను రానండీ! నవీన్‌కి రేపు ఎసైన్‌మెంట్ ఉంది' అని నేనంటే ఆయన నవ్వేవారు. 'నేను, అమ్మ చదువుకుంటాం నాన్నా, నువెళ్లిరా!' అనేవాడు నవీన్— అలాగే ఎప్పుడైనా 'మనం ఇవాళ సినిమాకెళ్దాం' అని నేనంటే 'నువ్వు, నేను చదువుకొందాం. నాన్నని వెళ్లమను" అనేసేవాడు వెంటనే!

కాలచక్రభ్రమణంలో మార్పులు జరిగాయి.

ఆయన లెక్చరర్ అయ్యారు.

మంచి వక్తగా పేరుపొందారు.

ఇప్పుడు డబ్బుకి ఇబ్బంది పడటం లేదు పూర్వపు రోజుల్లా...

ఆ ఇబ్బందులు, చేదు అనుభవం మళ్లీ పిల్లలు పుట్టకుండా జాగ్రత్త పడ్డాం శాశ్వతంగా.

నవీన్‌కి రకరకాల టిఫెన్లు చేసిపెట్టేదాన్ని.

పరీక్ష మొదలైన రోజు సేమ్యా పాయసం!

పరీక్ష పూర్తయ్యాక చక్రపొంగలి!

ఫస్ట్‌ర్యాంక్ వచ్చిన రోజు మంచి సినిమా, స్వీటు!

అలా... అలా...

వాడికి కావలసినంత నెయ్యి, పప్పు వేసి అన్నం కలిపి పెట్టేదాన్ని.

అయితే... చిన్నప్పటిలా తిండికోసం ఆత్రుత పడేవాడుకాదు. అసలు ఏం వండానో పట్టించుకోకుండా తినే స్థాయికి ఎదిగిపోయాడు.

నవీన్ ఇంటర్‌లో వుండగా మేము ఆ కాలేజీ హాస్టల్‌లో వదిలి ట్రాన్స్‌ఫర్‌మీద వెళ్లిపోయినపుడు...

"ఈ హాస్టల్ తిండి, వాతావరణం నాకేమీ సరిపోవడం లేదు. నువ్వు చేసిన కమ్మటి టమోటా పచ్చడి, కప్పులో పెరుగు నంజుకుని తింటుంటే... ఆ మధురానుభూతి ఇక్కడ ఎలా ఉంటుంది? మన వాకిట్లో పండువెన్నెల్లో నువ్వు చెప్తూన్న కథలు, కబుర్లు వింటూ భోంచేస్తూవుంటే కలిగే ఆనందం ఇక్కడ కరువైపోయింది. హోమ్లీగా ఫీలవటం లేదు. అయినా నీకిష్టమైన ఈ చదువులో మాత్రం లోటు కన్పించదు. ఐ ప్రామిస్ యు" అని ఉత్తరాలు రాసేవాడు. చిన్నచిన్న కవితలు కూడా కవర్లలో భద్రంగా నన్ను చేరుతూ వుండేవి.

కవితలు కవర్లలో అందినపుడు నా సంతోషం ఏమని వర్ణించను?

వాడికి కావలసినంత నెయ్యి, పప్పు వేసి అన్నం కలిపి పెట్టేదాన్ని. అయితే... చిన్నప్పటిలా తిండికోసం ఆత్రుత పడేవాడుకాదు. అసలు ఏం వండానో పట్టించుకోకుండా తినే స్థాయికి ఎదిగిపోయాడు నవీన్ ఇంటర్‌లో వుండగా..






నా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు "నువ్వు కూర్చో నేను వేపుడుకూర, అన్నం చేసి నీకు వడ్డిస్తాను" అన్నపుడు నేను ఆశ్చర్యపోయి "నీకు వంట తెల్సా?" అంటూ నోరెళ్లబెట్టినపుడు " దొండకాయ వేపుడు మూకుట్లో వేసి 'మూస్తూవుందు' అని నాకు చెప్పి, నువ్వు నా లెక్కల పేపరు దిద్దుతున్నపుడు, నేను మరచిపోయినపుడు, కూరంతా మాడిపోయిందని కోప్ప డటం నాకు జ్ఞాపకముందిలే! అప్పుడు తెల్సింది వేపుడు కూరంటే మూనె వేసి కలుపుతూ వుండాలని..."

'అయ్యో' అన్పించింది నా ప్రాణం ఆ మాట విన్నప్పుడు.

ఇక ఐ.ఐ.టిలో జాయిన్ అయిన క్రొత్తలోనే మేము క్రొత్తగా ఇల్లు కట్టుకున్నాం.

ఆ ఇంటిచుట్టూ మొక్కలు, కూరగాయల పాదులు వేశాడు. అవన్నీ బ్రతికి, బయటపడి ఫలవంతం అయిన తరుణంలో... ఐ.ఐ.టి పూర్తిచేసి ఇలా అమెరికా వెళ్లిపోవడం... ప్చ్...

'విమ్ము అవి స్నేహితుల్లా పలకరిస్తాయి. బొత్తిగా నీకు స్నేహితులు లేరు కదమ్మా! నేను వచ్చేవరకు అవి నిమ్ము పేద తీరుస్తాయి' అన్నాడు వెళ్లేముందు.

అయితే ప్రతి చిన్న పనికి గుర్తువచ్చే నవీన్.. పుత్రోత్సాహము జనులు కనుగొని పొగిడినపుడు నాకన్పించలేదు.

వాడు పసిపిల్లవాడుగా ఉన్నపుడు...

నడక వచ్చిన క్రొత్తలో... నేను పప్పు రుబ్బుకుం టూ వుంటే నా వెనుకగా వచ్చి నా వీపుపై పడి నా మీదనుండీ తన చిన్న రెండు చేతులనూ రోట్లో పెట్టి, నన్ను పని చేయొద్దంటూ గొడవ చేసినపుడు...,

మార్కులు తక్కువ వచ్చాయనీ, చదువుకోవడం లేదనీ నేను కొట్టినపుడు, కోప్పడినపుడూ నా వెంటపడే నా ప్రతిరూపాన్ని... ఆ వెంట నేనున్నపుడు, వంటివాడు గా వున్నపుడు రాత్రుళ్ళు ఏడ్చే అలవాటున్న నవీన్‌ని ఎత్తుకుని ఆయనకు నిద్రాభంగం లేకుండా బయట చీకట్లో తిరిగినపుడు... ఆ అనుభవం... నాలో ఊసులు... దాగుడుమూతలు ఆడినపుడు ఆ అనుభూ తి...

మా పేదరికం, డబ్బు ఇబ్బందులు, ఈతి బాధలు—

ఆ సౌఖ్యం— తీపిగురుతులు, దగ్గరితనం, బంధం, బాంధవ్యం—

ఇప్పుడేవీ??

నా ఉద్దేశ్యంలో పుత్రోత్సాహం తల్లికి పుత్రుడు జన్మించినపుడే...

జనులా పుత్రుని కనుగొని పొగిడినప్పటికి తల్లి ఆ పుత్రునితో విడదీయలేని బంధాన్ని కావాలని తెగగొట్టు కోలేని సంకట పరిస్థితిలో... అయోమయావస్థలో నిలిచిపోతుంది.

అప్పటికి సుమారుగా వారం గడిచింది.

ఏం వండుకుంటున్నామో, ఏం తింటున్నామో, ఎలా వుంటున్నామో తెలియకుండా మరమనిషిలా రోజులు గడిపేస్తూ... ఉంటుంటే...

"పోస్ట్" కేకవిని కేబుల్ వెళ్లి అందుకున్నాను.

'రీచ్డ్ సేఫ్' —నవీన్...

తిరిగి నవీన్ వచ్చేసినంత సంతోషం పొంగి పొరలగా పెరట్లోకి పరిగెత్తాను. నవీన్ వేసిన మొక్కలు ఎంతో ప్రేమగా పలకరించాయి— 'అమ్మా' అన్నట్టు... ఎన్నడూ ఎరగని ఉత్సాహం... అదే పుత్రోత్సాహం. ✱